వైద్యులకు పటిష్ట భద్రత కల్పించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యోదంతం దారుణం. నిందితులను కఠినంగా శిక్షించాలి. మహిళా డాక్టర్లు నైట్‌డ్యూటీలో ఉన్న సమయంలో రక్షణగా ఆస్పత్రి వద్ద పోలీస్ కానిస్టేబుల్‌ను నియమించాలి. ఆస్పత్రుల వద్ద సీసీ టీవీలను కూడా ఏర్పాటుచేయాలి.

– డాక్టర్ లక్ష్మీప్రసన్న,
జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రి



మహిళా వైద్యుల కోసం రెస్ట్‌రూమ్ ఉండాలి



ప్రతి ప్రభుత్వాస్పత్రిలో మహిళా డాక్టర్ల కోసం రెస్ట్ రూమ్ ఉంటే బావుంటుంది. ఎఫ్‌డీపీ(ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం)లకు వెళ్లినపుడు కొన్నిచోట్ల కనీసవసతులు కూడా లేక ఆరుబయట ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఎఫ్‌డీపీలకు వెళ్లే వైద్యులకు కనీస సదుపాయాలు, భద్రత కల్పించాలి.

– డాక్టర్ జె.నాగరాణి,
పీపీ యూనిట్ జగ్గయ్యపేట

చిరు వ్యాపారులకు తోడేది?

- వీధి వ్యాపారులకు కొరవడిన భరోసా..
- వడ్డీలేని రుణాల మాటే మరచిన కూటమి ప్రభుత్వం..
- అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోలేక అవస్థలు
- పాత పథకాన్ని కొనసాగించాలంటున్న చిరు వ్యాపారులు





కంచికచర్ల, గండేపల్లిలో రోడ్డు పక్కన వ్యాపారం చేస్తుకుంటున్న చిరు వ్యాపారులు

కంచికచర్ల : రోడ్డు పక్కన చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులకు ఆర్థిక భరోసా కరువైంది. పెట్టుబడి సాయంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా అందించిన వడ్డీ లేని రుణం కాస్తా టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిపోవడంతో చిరువ్యాపారులు ఇబ్బందిపడుతున్నారు. తీసుకున్న రుణాన్ని చిరువ్యాపారులు సకాలంలో చెల్లిస్తుండటంతో బ్యాంకులు సైతం వారికి ఇతర రుణాలను ఇచ్చేందుకు సానుకూలంగా ఉండేవి. కాని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెట్టుబడి సాయం అందక చిరువ్యాపారులు అవస్థలుపడుతున్నారు.

ఆర్థిక చేయూత లేక అవస్థలు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి వీధి వ్యాపారులకు ఆర్థికంగా తోడు లేకుండా పోయింది. దీంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీతో రుణాలు తీసుకుని నిత్యం వ్యాపారం చేసుకుంటూ వారికి వచ్చిన లాభంలో గరిష్ట భాగమంతా వడ్డీల కింద చెల్లిస్తున్నారు. రోజుకు రూ.500 సంపాదిస్తే దానిలో రూ.150 నుంచి రూ.200 వరకు రోజువారీ వడ్డీ చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో కుటుంబపోషణ కూడా కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నాడు వేలాది మందికి సాయం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నందిగామ నియోజకవర్గంలో జగనన్న తోడు పథకం కింద 10వేలకుపైగా వీధివ్యాపారులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున వడ్డీలేని రుణాలు అందించారు. వీధి వ్యాపారుల తీసుకున్న అప్పునకు ప్రభుత్వం, బ్యాంకులకు వడ్డి చెల్లించేంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం కింద లబ్ధి చేకూరే విధంగా వలంటీర్ల సహాయంతో రుణాలు అందించే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం బ్యాంకులు తమకు ఎటువంటి రుణాలు ఇవ్వడం లేదని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధికవడ్డీలకు రుణాలు తీసుకోవాల్సి వస్తోందని చిరువ్యాపారులు వ్యాపారులు చెబుతున్నారు. దీంతో రోజులో సంపాదించిన మొత్తంలో అధికమొత్తం వడ్డీ కింద జమచేయాల్సి వస్తోందని వాపోతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించి, తమకు వడ్డీలేని రుణాలను అందించడం ద్వారా ఆర్థికంగా అండగా నిలవాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.

రుణాలు ఇప్పించి ఆదుకోండి...



గత ప్రభుత్వం అండగా నిలిచి వడ్డీ లేకుండా రుణం ఇవ్వడంతో ఆ డబ్బుతో సరుకులు కొనుగోలు చేసి రోజూ అమ్ముకునేవాళ్లం. దీంతో మాకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. ప్రస్తుతం రుణసదుపాయం లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. బ్యాంకులు మాలాంటివాళ్లకు అప్పులు ఇవ్వవు. ప్రైవేట్‌వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సి వస్తోంది. రాష్ట్రప్రభుత్వం రుణసదుపాయం కల్పించి మమ్మల్ని ఆదుకోవాలి.

– తుపాకుల శ్రీనివాసరావు,
చిరు వ్యాపారి, కంచికచర్ల

వ్యాపారం కోసం రూ.10వేలు ఇచ్చారు...



నేను కృష్ణానదిలో మత్స్యకారుల నుంచి చేపలు కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయిస్తుంటాను. వ్యాపారం పెంచుకునేందుకు గత ప్రభుత్వం రూ.10వేలు ఇచ్చింది. ఆ డబ్బుతో ఎక్కువ చేపలు కొనుగోలు చేసి అమ్ముకునేవాడిని. ప్రస్తుతం పెట్టుబడి సాయం అందకపోవడంతో బయట వ్యక్తుల నుంచి అధిక వడ్డీ చెల్లించి రుణం తీసుకుని వ్యాపారం చేస్తున్నా. రాష్ట్రప్రభుత్వం మాలాంటి వారికి రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

– మండా రామారావు,
చేపల వ్యాపారి, కొత్తపేట

కోల్‌కతా ఘటనపై వైద్యుల నిరసన



గండ్రాయిలో నిరసన వ్యక్తం చేస్తున్న బూచవరం వైద్యాధికారులు, సిబ్బంది

గండ్రాయి(జగ్గయ్యపేట): కోల్‌కతాలో ఆర్‌జీకర్ ప్రభుత్వాసుపత్రి వైద్యకళాశాలలో వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసినవారిని కఠినంగా శిక్షించాలని బూచవరం ప్రభుత్వాసుపత్రి వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. వైద్యులకు భద్రత కల్పించడంతోపాటు కోల్‌కతా ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గండ్రాయి గ్రామంలో బూచవరం ప్రభుత్వాసుపత్రి వైద్యసిబ్బంది శనివారం మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ కీర్తిరెడ్డి మాట్లాడుతూ ప్రాణదాతలపై దాడులను ప్రభుత్వం నియంత్రించాలన్నారు. వైద్యులపై రోజురోజుకు దాడులు పెరుగుతుండటం తగదన్నారు. వైద్యుల భద్రత కోసం ఆరోగ్యశాఖ ఓ ప్రత్యేకమైన చట్టం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలను కోరారు. నిరసన కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మి వెంకట్రావు, సిహెచ్‌వో నాగలక్ష్మి, వైద్య సిబ్బంది మంగా రమారత్నం, గాతాల అనురాధ, కంబాల రాజకుమారి, రమేష్, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పెనుగంచిప్రోలులోని సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం

పెనుగంచిప్రోలు: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఈనెల 26న ఆలయాల్లో వేడుకలు నిర్వహించనున్నారు. గ్రామంలోని మునేరు పక్కన వేంచేసియున్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం గ్రామంలో ఊరేగింపు అనంతరం రాత్రి 7గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉట్టికొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కొమరగిరి రఘురామారావు శనివారం తెలిపారు. స్థానిక తూర్పుబజారున ఉన్న గీతామందిరంలో కూడా ప్రత్యేక పూజలు, గీతాపారాయణంతోపాటు భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అనిగండ్లపాడుతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో కూడా శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

చోరీలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌ఐ



ఆటోకు కరపత్రం అంటిస్తున్న ఎస్‌ఐ సూర్య శ్రీనివాస్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): దొంగతనాలు చోటుచేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిల్లకల్లు ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ సూచించారు. చోరీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ చిల్లకల్లు పోలీసులు శనివారం మండల ప్రజలు అవగాహన కల్పించారు. ఆటో స్టాండ్‌లో ఆటోలకు కరపత్రాలు అంటించారు. గ్రామాల్లో టాంటాం, మైక్ ప్రచారంతోపాటు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కరపత్రాలు కూడా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):మండలంలోని అనిగండ్లపాడులో శనివారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో ముందస్తుగా మురుగుకాలువలు శుభ్రంచేయడంతోపాటు వీధులు మొత్తం బ్లీచింగ్ చల్లించారు. వర్షాలు పడకపోతే రెండు రోజుల్లో దోమల మందు కూడా స్ప్రేచేస్తామని సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం తెలిపారు. పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ సాయిహర్ష, ఈవోపీఆర్‌డీ ప్రసాద్ పర్యవేక్షించారు.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన



మైలవరంలో క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి

మైలవరం: సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి వి. ఉమాలక్ష్మి ఆధ్వర్యంలో నేషనల్ స్పేస్ డేను పురస్కరించుకుని విద్యార్థులకు శనివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం స్ఫూర్తితో విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్పేస్ డే ప్రాముఖ్యతను వివరించారు. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె. రాముడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏరో స్పేస్ విభాగంలో చంద్రయాన్–3 మిషన్ ఇస్రో మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నేషనల్ స్పేస్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు అంతరిక్షయానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. డిజిటల్ పోస్టర్ ప్రజంటేషన్ ఆన్ పాస్ట్ అండ్ ఫ్యూచర్ మూన్ మిషన్, ఫ్యూచర్ మాండ్ స్పేస్ మిషన్స్ బై ఇస్రో అనే అంశాలపై ఈవెంట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుల సమస్యలపై ధర్నా



ఎ.కొండూరు: కిడ్నీ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ మాట్లాడుతూ ఎ.కొండూరు మండలంలో గిరిజన, దళిత, బలహీన వర్గాలు, పేదలు కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారని చెప్పారు. 2024 సంవత్సరంలో ఇప్పటివరకు 63 మంది మృతి చెందారన్నారు. డయాలసిస్ రోగులకు ఇస్తున్న రూ.10 వేల పెన్షన్ సరిపోవడం లేదని, ఇతర కిడ్నీ వ్యాధి గ్రస్తులకు ఎటువంటి సహాయం అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తిరువూరు నియోజకవర్గంలో కిడ్నీ సమస్యలు అధ్యయనం చేసేందుకు నిపుణులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, తిరువూరు నియోజకవర్గంలో కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, కృష్ణానది మంచి నీటి పథకానికి తక్షణమే నిధులు మంజూరు చేసి వేగంగా పూర్తి చేయాలని, డయాలసిస్ రోగులకు రూ. 20 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజాసంఘాల నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన కిడ్నీ బాధితులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

ఆగిరిపల్లి: పోతవరప్పాడు ఎన్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ తమ్మిశెట్టి అశోక్ విట్ యూనివర్సిటీ ద్వారా పీహెచ్‌డీ డిగ్రీ పట్టాను పొందారు. 'సిములేషన్ అండ్ మోడలింగ్' అంశంపై పరిశోధన చేసినందుకు గాను ఆయనకు డాక్టరేట్ పట్టా లభించింది. ఈ సందర్భంగా అశోక్‌ను కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ సాంబశివరావు, పలువురు అధ్యాపకులు అభినందించారు.

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



గండ్రాయిలో రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో ఉన్న విద్యార్థులతో టీచర్లు



అన్నవరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు



మక్కపేట సాయిసెంచరీ హైస్కూల్‌లో..

జగ్గయ్యపేట: మండలంలోని అన్నవరం, గండ్రాయి గ్రామాల్లోని మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినీవిద్యార్థుల రాధాకృష్ణులు, గోపికల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు మాట్లాడుతూ మనసంస్కృతి, సంప్రదాయాలు వాటి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రమేష్‌బాబు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, గోవిందు, శ్రీదేవి, సుబ్బారావు, రమాదేవి, పద్మావతి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో...

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక లిటిల్ ఏంజిల్స్, నాగార్జున హైస్కూళ్లలో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లిటిల్ ఏంజిల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌ఎస్‌ఆర్‌ఎస్ శ్రీనివాస్, పాలకవర్గ ఉపాధ్యక్షుడు మేజర్ ఎస్‌వీవీ. సత్యనారాయణరావు, కార్యదర్శి శ్రీరాం బదరీనారాయణ, ఉషోదయ స్కూల్ డైరెక్టర్ జి.రామమోహనరావు, ప్రిన్సిపాల్ జీవీ రాజేష్ పాల్గొన్నారు.



జగ్గయ్యపేట లిటిల్ ఏంజిల్స్ హైస్కూల్‌లో ...

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : స్థానిక శ్రీ వెంకటేశ్వర హైస్కూల్, అన్నపూర్ణ విద్యాలయం, మక్కపేటలోని శ్రీసాయి సెంచరీ, శారదా పాఠశాలలతోపాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బాలకృష్ణుడు, రాధాగోపికల వేషధారణలో చిన్నారులు అందరినీ అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అందంగా ముస్తాబు అయిన చిన్నారులకు ఉపాధ్యాయులు బహుతులు అందజేసి అభినందించారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: స్థానిక ఉషోదయ పబ్లిక్ హైస్కూల్, శ్రీఅక్షర స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ప్రత్యేకాకర్షణగా నిలిచారు. చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమం అందరినీ అలరించింది. ఉషోదయ పాఠశాల కరస్పాండెంట్ పి.కిరణ్‌కుమార్, డైరెక్టర్ హరీష్, శ్రీఅక్షర స్కూల్ స్కూల్ కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జగ్గయ్యపేట నాగార్జున హైస్కూల్‌లో...



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఉషోదయ హైస్కూల్ విద్యార్థులు



శ్రీఅక్షర స్కూల్‌లో ఉట్టి కొడుతున్న విద్యార్థి

దోమల నిర్మూలనకు చర్యలు: కమిషనర్



జగ్గయ్యపేట అర్బన్: వర్షాకాలం అయినందున వృద్ధి చెందుతున్న దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రధానవీధుల్లో శనివారం సాయంత్రం దోమల నిర్మూలనకు రసాయనాలతో కూడిన ఫాగింగ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, మేస్త్రీలు, పారిశుద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన

వీరులపాడు:ఎయిడ్స్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు బాలారెడ్డి సూచించారు. వీరులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కెవిఎంఎస్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని పేర్కొన్నారు. సంస్థ నిర్వాహకులు షిబా, ప్రసాద్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

వత్సవాయి: కొమరగిరి ట్రస్టు మరియు పిన్నమనేని సిద్దార్థ కంటి వైద్యశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్ కేఆర్ భరద్వాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వత్సవాయిలోని శ్రీవెంకటేశ్వర హైస్కూల్‌లో ఉదయం పది గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని చెప్పారు. శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్‌కార్డును తీసుకుని రావాలని సూచించారు. వైద్యపరీక్షల అనంతరం ఆపరేషన్లు అవసరమైన వారిని వెంటనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తామని భరద్వాజ్ వివరించారు.

పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని వినతి

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): మండలంలోని ముచ్చింతాల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు నెల్లూరి గోపి ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో కోరారు. తమ గ్రామంలో పీఏసీఎస్ లేకపోవడంతో అనిగండ్లపాడు సంఘానికి వెళ్లటానికి రెండు ఆటోలు మారాల్సి వస్తోందన్నారు. అనిగండ్లపాడు సంఘంలో తమ గ్రామానికి చెందిన రైతులు 475 మంది సభ్యులుగా ఉన్నారని వివరించారు. సంబంధిత అధికారులు స్పందించి రైతుల సౌకర్యార్థం తమ గ్రామంలో పీఏసీఎస్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

150 మందికి వైద్యపరీక్షలు

కంచికచర్ల : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం జాతీయ మానవహక్కుల, నేర నియంత్రణ బ్యూరో ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నారాయణ పాల్గొని మొత్తం 150మందికి కంటివైద్య పరీక్షలు చేసి 15మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారని సర్పంచి వేల్పుల సునీత తెలిపారు. సంఘ జాయింట్ కార్యదర్శి భవాని, వేల్పుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సులపై యువతకు ఉచిత శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: మానవ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ కోర్సు(స్యాప్ ఎస్‌డీ)లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ శనివారం తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల విద్యార్థులకు విజయవాడలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ తరగతులు సెప్టెంబర్ 28వతేదీన ప్రారంభమై మూడునెలలపాటు కొనసాగుతాయన్నారు. ఇతర వివరాలకు సెల్‌నంబరు 9985222857లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

కంచికచర్ల : ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాన్ని సీజ్ చేయడంతోపాటు కేసు నమోదు చేస్తామని కంచికచర్ల ఎస్‌ఐ బోనగిరి రాజు హెచ్చరించారు. మండలంలోని మోగులూరు మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



జగ్గయ్యపేట: తెలంగాణకు చెందిన 288క్వార్టర్ సీసాల మద్యాన్ని జగ్గయ్యపేట ఎస్‌ఈబీ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఈబీ సీఐ మణికంఠరెడ్డి కథనం ప్రకారం తెలంగాణ రాష్ట్రం కోదాడ నుంచి కారులో చిల్లకల్లుకు మద్యం వస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఈబీ పోలీసులు బలుసుపాడు రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో ఓ కారులో 288 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మద్యాన్ని కారులో తరలిస్తున్న చిల్లకల్లుకు చెందిన అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కొడుకు కనిపించడంలేదని తల్లి ఫిర్యాదు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): తన కొడుకు కనిపించడంలేదంటూ చిల్లకల్లు గ్రామానికి చెందిన గుంజి బేబి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తోట సూర్య శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు..వత్సవాయి మండలం మక్కపేట గ్రామానికి చెందిన శివ అనేవ్యక్తితోపాటు చిరంజీవి, శివరంగా, నాని అనే వ్యక్తులు శుక్రవారం రాత్రి ఏడుగంటలసమయంలో గుంజిబేబి ఇంటికి వచ్చారు. పని ఉందని చెప్పి ఆమె కుమారుడు గుంజి గోపిని ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లి, అర్ధరాత్రి సమయంలో తిరిగి అతన్ని ఇంటివద్ద వదిలివెళ్లారు. అయితే అప్పటికే తీవ్ర గాయాలతో ఉన్న గోపి, తనను గాయపరిచిన విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పడంతోపాటు ఫోన్ ద్వారా స్నేహితులకు కూడా తెలియజేశారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం నుంచి గోపి కనిపించకుండా పోయాడు. దీంతో అతని తల్లి తనకుమారుడు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.